# ముల్లుకర్ర - ఎద్దు

గాంధీ హాస్పటల్లో....ఓ.పి.కి ఎదురుగా....పిట్టగోడపై కూర్చుని దాదాపు అరగంట నుండి చూస్తున్నాడు నరసింహమూర్తి.

ఆమె అలానే ప్రాధేయపడుతోంది.

డాక్టర్ అలాగే ఒంటిపై వాలిన ఈగలా ఆమెను కసిరి కొడుతూ, విసుక్కుంటూ అసహ్యించుకొంటున్నాడు.

ఓ.పి. గేటు దగ్గరి బంట్రోతు ఆమె మెడపై తన చేతిలోని కర్రను పెట్టి బలవంతంగా బయటికి నెట్టేస్తున్నాడు.

ఆమె చంకలోని పసివాడు అరగంట ముందు వాడిపోయిన తోటకూర కాడలా ఉన్నవాడల్లా బాధతో గిలగిలా తన్నుకోవడం ప్రారంభించి, రెక్కలు తెగిన పక్షిలా కొట్టుకుంటున్నాడు

ఇంతకుముందు ఆమె డాక్టర్ నడిగినపుడు అతనేదో తెల్లగోలీ చేతిలో పెట్టి పొమ్మన్నాడు.

"నేద్దొరా! పోరడుకోసిన కోడల్లె ఎగిరెగిరి పడ్తాండు. కొస్త సూడుండ్లి" అని దండం పెడ్తోంది.

"అ గోలెయ్యి పో. పోద్ది" అని గద్దించాడు డాక్టర్.

వెంటనే గేట్‌బాయ్ ఆమెను బయటికి నెట్టుకుపోయాడు.

ఆమె దర్వాజా దగ్గర నిలబడి "ఓ దొరా...ఓ దొరా!" అని మొరపెట్టుకుంటోంది.

ఓ.పి.లో జనం రద్దీకూడా లేదు. కాని లోపల డాక్టర్, అంద మైన తెల్లకుందేలు లాంటి నర్సును ఎదురుగా కూర్చోబెట్టుకుని ముచ్చట పడుతూ ఎప్పుడో లోకాన్ని మరిచిపోయినట్టున్నాడు–ఒట్టికల్లుతాగిన కోతిలా యికిలిస్తున్నాడు పిచ్చిగా.

నరసింహమూర్తి తీక్షగా గమనిస్తున్నాడు ఆమెనూ, డాక్టర్‌నూ, నవ్వే నర్సునూ.

ఓ.పి. గేట్ దగ్గిర గోడపైన ఓ నీలం రంగు బోర్డుంది: "ప్రమాదంలో ఉన్న రోగులు క్యూలో కాకుండా సరాసరి డాక్టర్‌గారిని చూడండి'' అని.

మరి ఆమె దగ్గిరఉన్న కుర్రాడు ఉన్నది ప్రమాదంలో కాకుంటే ప్రమోదంలోనా?

అదే గోడపైన పెద్దగా ఎర్రని అక్షరాలతో రాసి ఉంది... ''డాక్టరంటే మనిషిని బ్రతికించగలిగే ప్రత్యక్ష దైవం" అని.

దైవం–ఎదురుగా చావుబ్రతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్న ఆ కుర్రాడి వంక కనీసం చూడనైనా చూడకుండా రంభతో సయ్యాట లాడుతున్నాడేమిటి?

అదే ఆ కుర్రాడు ఏ డబ్బున్న మనిషి కొడుకో అయితే... వెంటనే ఓ యాభై రూపాయలు లంచం తీసుకుని, అర్జంటుగా అడ్మిషన్ యిచ్చి నానా హంగామా చేసి–అసలీ సీనే యింకో రకంగా ఉండేది.

కాని ఆమె డబ్బున్న మనిషి కాదుగదా...అసలు మనిషిలా కూడా లేదు. ఓ రెండు రోజులు మురికి కాలువలో ముంచితీసిన మట్టి బొమ్మలా ఉంది. ఆమె భుజంపై నున్నపిల్లాడు ఒట్టి తోలు తిత్తిలా వున్నాడు.

ఇంకో పావుగంట గడిచింది.

వాతావరణంలో ఏమాత్రం మార్పు రాలేదు.

ఆమె మొత్తుకుంటూనే ఉంది...బాయ్ కుక్కలా కుయ్‌మని మొరుగుతూనే వున్నాడు. డాక్టర్ ఇంకా రంభ చుట్టూ పరుచుకొని వున్న గాఢాకర్షణా క్షేత్రం నుండి కోలుకోలేదు.

నరసింహమూర్తికి ఆమెపై జాలేసింది. ఆ పిల్లవానిపై అంత కంటే ఘోరమైన జాలేసింది. తత్ఫలితంగా డాక్టర్‌పై, తద్వారా రంభపై....తర్వాత ఆ హాస్పటల్‌పై అలా అంచెలంచెలుగా అసహ్యమేసింది.

"ఇప్పుడు తను ఏ రకంగా ఆమెకు సహాయం చేయగలడు?.... ఎలా ఆమెను ఆదుకోగలడు?" అని ఆలోచించాడు

డాక్టర్‌ను అడుగగలడు విలటీసి కాని దానివలన జరిగేదేమిటి. జరిగేదేమిటి? 'నువ్వెవడివోయ్' అని వాడంటే తన జవాబేమిటి? ప్చ...పోనీ ఏదో అని ఏదో రభస చేసినా ఆ కుర్రాడిని అతడు చూస్తాడని నమ్మకమేమిటి?

నరసింహమూర్తిని ఆలోచన కుమ్మరిపురుగులా తొలుస్తోంది.

ఇంతలో డాక్టర్ చటుక్కున సీట్‌నుండి లేచి_ఓ.పి. గదిలో నుండి బయటికి వచ్చి ఎటో...యింకో దిక్కు గబగబా నడిచిపోతూ_

ఆమె అతని వెంటనే నడుస్తూ ఏదో అంటూ ప్రాధేయ పడుతోంది.

నరసింహమూర్తి చటుక్కున గోడపై నుండి దిగి చుట్టూ చూశాడు. ఓ యువకుడు_విద్యార్థిలా ఉన్నాడు. వెళ్తున్నాడు గంభీరంగా అటువైపునుంచి_పిలిచాడు.

అతను రాగానే ... "మీరో సహాయం చేయాలి ... ఓ రెండు నిమిషాలు నాతో యీ లాంజ్‌లో నిలబడగలరా అన్నాడు నర సింహమూర్తి.

"ఓ.కే." అన్నాడతను.

యీలోగా నరసింహమూర్తి చేయదలచుకున్నది చెప్పాడతనితో అతనూ సరేనన్నాడు అంతా విని.

ఇంకో రెండు నిమిషాల తర్వాత డాక్టర్ ఆ లాంజ్ చివర ఉన్న ఎక్స్‌రే గదిలో నుండి బయటికొచ్చి-మళ్ళీ ఓ.పి. దిక్కు వస్తూ-

అతను బయటికి రాగానే ఆమె మళ్ళీ వెంటబడింది కుర్రాడ్ని చూపిస్తూ.

డాక్టర్ నరసింహమూర్తి దగ్గరకు రాగానే....పక్కనున్న యువకునితో "ఆ డాక్టర్ వెంట వస్తోందే ఆమెను మినిస్ట్రీ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ పంపించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మామూలు మనుషులను ఎలా ట్రీట్ చేస్తారో కనుక్కునేందుకు యీమెతో ప్రయోగం చేస్తున్నారు. యీమె హాస్పటల్‌లోకి అడుగు పెట్టింది మొదలు హాస్పటల్ అథారిటీస్ మూమెంట్సన్నింటినీ సి.ఐ.డీస్ రికార్డ్ చేస్తున్నారు" అన్నాడు వెనుక నుండి నడిచి వెళ్తున్న డాక్టర్‌కు స్పష్టంగా వినిపించేలా.

డాక్టర్ కరెంట్‌షాక్ తిన్న మనిషిలా చటుక్కున వెనుతిరిగి... వెంట కుప్పలోని ప్లాసిక్ బొమ్మలా ఉన్న ఆమె వంకా, నర సింహమూర్తి వంకా పరిశీలనగా చూచి....అదిరిపడి-

"నువ్వు రామ్మా..." అన్నాడు ఆమెతో.

ఆమె డాక్టర్ వెంట నడిచింది గబగబా.

ఆమెను తీసుకెళ్ళి ఓ.పి.లో కూర్చోబెట్టి-వెంటనే సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి...హడావిడిగా-

ఓ ఐదు నిమిషాల్లో సూపరింటెండెంట్‌తో సహా ఐదుగురు డాక్టర్లు ఆ బిచ్చపు పిల్లవాణ్ణి పరిశీలించి పరిశీలించి...వెంటనే కేస్‌ను అడ్మిట్ చేసుకుని...చికిత్స భారీ ఎత్తున జరుగుతోంది వైద్య నిపుణుల పర్యవేక్షణలో.

ఆమె ఆశ్చర్యపోయి చూస్తోంది ఆ పరిణామానికి.

నరసింహమూర్తి తన ప్రక్కనున్న యువకునితో "థాంక్సండీ! చాలా సహాయం చేశారు'' అన్నాడు కృతజ్ఞతతో.

"ఈ దేశంలో ముల్లు కర్రతో పొడవందే ఏ ఎద్దూ నడిచేట్టు లేదు'' అని ఆ యువకుడు గొణుక్కోవటం నరసింహమూర్తికి స్పష్టంగా వినబడింది.